మేమంటే ఎందుకంత కోపం?

- వలంటీర్ల సేవలను అడ్డుకోవడంపై వృద్ధులు, దివ్యాంగుల ఆగ్రహం
- ఈ ఎన్నికల్లో చంద్రబాబుకు మా ఉసురు తగులుతుందని శాపం

గుంతకల్లుటౌన్/రూరల్/పామిడి/తాడిపత్రి రూరల్: ఇంటింటికీ పింఛన్ పంపిణీకి మాజీ సీం చంద్రబాబు, ఎల్లోమీడియా, నిమ్మగడ్డ రమేష్ అండ్‌కో బ్రేకు పడేలా చేసింది. వలంటీర్ల సేవలను కోర్టుకు వెళ్లి మరీ అడ్డుకున్నారు. దీంతో పేదలకు ప్రతి నెలా 1వ తేదీ అందాల్సిన పింఛన్ డబ్బులు అందక పోవడంతో చంద్రనాయుడుపై పింఛన్‌దారుల నుంచి సర్వత్రా ఆగ్రహావేశాలు వెల్లుబుకుతున్నాయి. చంద్రబాబూ... మేమంటే నీకెందుకు అంత కోపం అంటూ వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు ప్రశ్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో మా ఉసురు తగులుతుందంటూ శాపనార్థాలు పెట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుని చంద్రబాబుకు బుద్ధి చెబుతామన్నారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వారు పేర్కొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడు గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన మాల మల్లయ్య. గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసేవాడు. మూడు సంవత్సరాల క్రితం పక్షవాతానికి గురై మంచం పట్టాడు. అప్పటినుంచి వలంటీర్ నేరుగా అతడి ఇంటివద్దకు వెళ్లి ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ పేరుతో పింఛన్లను వలెంటీర్‌లు ఇళ్ల వద్దకు వెళ్లి పంచకూడదంటూ టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో.. కమిషన్ వలంటీర్లను పక్కన పెట్టేసింది. ఎన్నికల నియమావళి పేరుతో చంద్రబాబు వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు నరసమ్మ. ఊరు తాడిపత్రి. నడవలేని పరిస్థితుల్లో మంచానికే పరిమితమైంది. కూతరుతో ఇంట్లో ఉంటోంది. మందుల ఖర్చుకు పింఛనే అధారం. ఈ నెల 2వ తేది వచ్చినా ఫించన్ రాలేదు. 'చంద్రబాబు ఫిర్యాదుతో వలంటీర్‌ను తీసి వేశారు. నువ్వే సచివాలయానికి వెళ్లి ఫించన్ తీసుకోవాలి' అని కూతురు చెప్పింది. నేను ఎలా సచివాలయానికి వెళ్లి ఫించన్ తీసుకోగలను. మంచంపై నుంచి పైకి లేవలేనంటూ వృద్ధురాలు కన్నీటి పర్యతమైంది. ఎండలు మండుతున్నాయి. ఎండలో ఫించన్‌కు వెళ్ళి అక్కడ నిలబడి తిరిగి ఇంటికి రాగలనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.



వలంటీర్లంటే ఎందుకంత భయం



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే 6 గంటలకు మా వలంటీర్ ఇంటికొచ్చి గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్ ఇచ్చేవాడు. కానీ చంద్రబాబునాయుడు, అతడికి సంబంధించిన వ్యక్తులు వలంటీర్లపై కంప్‌లైంట్ చేసి పింఛన్లను ఇవ్వకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. నేను సైకిల్‌షాపులో మెకానిక్‌గా పనిచేస్తున్నాను. నాకు రోజూ రూ.500 కూలి లభిస్తుంది. ఇప్పుడు పింఛన్ తెచ్చుకోవడానికి సచివాలయానికి వెళ్లాలంటే పనికి దుమ్మాకొట్టాలి. దీంతో ఒకట్రెండు రోజుల కూలీ నష్టపోతాను. మా పేదల కడుపు కొట్టడం వల్ల చంద్రబాబు, ఆయన మనుషులకు వచ్చిన లాభమేంటి? ప్రభుత్వం ఇస్తున్న స్కీములన్నింటినీ ఇంటికి చేరుస్తున్న వలంటీర్లపై ఎందుకంత కడుపుమంటో అర్థమే కావడం లేదు. మీ స్వార్థ రాజకీయాలు పక్కనపెట్టి మా లాంటి పింఛన్‌దారులకు ఇబ్బంది లేకుండా వలంటీర్‌ల చేత పింఛన్ అందేలా చూడాలి.

–ఖాజా మైనుద్దీన్, దివ్యాంగుడు, గుంతకల్లు

కళ్లు కనిపించవు



15 ఏళ్ల వయస్సు నుంచే కళ్లు కనిపించకుండా పోయాయి. కంటి వైద్య నిపుణులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో పెళ్లి కూడా చేసుకోలేదు. ఇప్పుడు నాకు 60 సంవత్సరాలు. నా ఆలనా!పాలనా!! అంతా నా అన్న కుమారులే చూస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ 5 సంవత్సరాలుగా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బులు రూ.3 వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో ఎన్నికలను అడ్డుపెట్టుకుని వారి స్వార్థపూరిత రాజకీయాల కోసం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టరాదని ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేశారు. తద్వారా గ్రామ సచివాలయం వద్దకే వెళ్ళి పింఛన్‌డబ్బులు తీసుకునేలా చేసింది. నేను సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు ఎలా తెచ్చుకోవాలి, పింఛన్ల పంపిణీ బ్రేకు వేసిన వారికి మూగోడు తప్పదు. తిరిగి జగన్ సీఎం అయితే మా లాంటి వారికి పింఛన్ తంటాలు ఉండవు.

–ఎస్ శంకరయ్య, దేవరపల్లి గ్రామం, పామిడి మండలం

నడవలేని పరిస్థితి



ప్రతి నెలా 1వ తారీఖున వలంటీర్లు తలుపుతట్టి పింఛన్ డబ్బులు చేతికిచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం ఈనెల పింఛన్ పంపిణీ వలంటీర్ల ద్వారా చేపట్టరాదని టీడీపీ అధినేత చంద్రబాబు అండ్‌కో పేదల పింఛన్ల పంపిణీకి మోకాలడ్డారు. వారి పుణ్యమా అని పేదలు పింఛన్ల కోసం గ్రామ సచివాలయం వద్ద వేచిచూడాల్సిన పరిస్థితి, తిరిగి బాబు హయాంను గుర్తుకు తెచ్చింది. ఆరు నెలల క్రితం బాత్‌రూమ్‌లో పడ్డాను. దీంతో కుడికాలు విరగగా, ఆపరేషన్ చేయించుకున్నా. ప్రస్తుతం నడవలేని పరిస్థితి. అధికారం లేకుండానే ఇలా పేదల కంట కన్నీరు కారిస్తున్న బాబు, అధికారం వస్తే పేదలకు చుక్కలు చూపిస్తారనడానికి ఇంతకంటే నిదర్శన మేముంది. పేదింటి పెద్ద కొడుకైన సీఎంజగన్‌తోనే పేదల కష్టాలు తీరేది.

–పీ శంకుతలమ్మ, దేవరపల్లి గ్రామం, పామిడి మండలం

వలంటీర్లపై కక్ష సాధింపు హేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు వారధిలా ఉన్న వలంటీర్లపై కక్ష పెంచుకున్న చంద్రబాబు, ఆయన కూటమి నాయకులు మాజీ ఎన్నికల అధికారిని అడ్డం పెట్టుకుని ఈసీకి ఫిర్యాదు చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను ఇబ్బందులకు గురిచేయడం హేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు తెల్లవారగానే ఇంటి వద్దే పింఛన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారని, ఈ పరిస్థితిని తట్టుకోలేని కూటమి పక్షాలు ఇలా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. ఈ పరిస్థితులు చూసిన వలంటీర్లు రాజీనామా చేసి సేవలను కొనసాగిస్తామని నిర్ణయానికి రావటం చూస్తే కూటమి కుయుక్తులు ప్రజల్లో ఎంతగా నాటుకున్నాయో అర్థమవుతోందన్నారు. తమపై ప్రతిపక్షానికి ఎంత కసి ఉందో.. మేం అంతే కసిగా పని చేస్తామని వలంటీర్లే స్వయంగా చెబుతున్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వెళ్లి పింఛన్ అందుకోవాలంటే కష్టమైనా ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించక తప్పదన్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండల నాయకులు, కార్యకర్తలతో గ్రామాల్లోని పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మనందరెడ్డి, సర్పంచులు పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'టిప్పర్ డ్రైవర్'ను ఆదరించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు



నిలువురాయి గ్రామంలో టీడీపీ నాయకుడు జనార్దన్‌కు పార్టీ కండువా కప్పుతున్న శింగనమల అభ్యర్థి వీరాంజనేయులు, పైలా నరసింహయ్య, ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి టిప్పర్ డ్రైవర్‌ను ఆదరించాలని శింగనమల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు కోరారు. మంగళవారం ఆయన మండలంలోని చామలూరు, నిలువురాయి, కర్ణపుడికి, కురగానపల్లి, కేసేపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి ప్రచారం చేశారు. ముందుగా వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే నాయకులు, కార్యకర్తలు డప్పు, వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వమన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో హామీలిచ్చి.. గెలిచిన తరువాత విస్మరిస్తోందన్నారు. కానీ జగనన్న ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చి గొప్ప నాయకుడన్నారు. దొంగ హామీల బాబుకన్నా, మాటకు కట్టుబడి ఉండే జగనన్న ఫ్యాన్ గుర్తుకు మరో మారు ఓటు వేసి ప్రతి పక్షాలకు బుద్ధి చెబుదామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, అగ్రి బోర్డ్ చైర్మన్ నాగలింగారెడ్డి, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పుల్లారెడ్డి లక్ష్మిరెడ్డి, బండి లలితా కళ్యాణి, అశోక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నుంచి వలసలు జోరందుకున్నాయి.మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిలువురాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జనార్దన్, వెంకటేష్ కుటుంబసభ్యులు, కర్ణపుడికి గ్రామంలోని టీడీపీ నాయకుడు బూసగాని విశ్వనాథ్ కుటుంబంతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు విజయం కృషి చేస్తామన్నారు.

గుమ్మనూరు రాకతో గుంతకల్లు ప్రజలకు దడ



మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామాంజనేయులు

గుంతకల్లుటౌన్: ఆలూరులో అరాచకాలు చేసిన గుంతకల్లు టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్ రాకతో స్థానిక ప్రజల్లో దడ పుట్టిందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు కె. పాలాక్షి, టి.రామాంజి నేయులు అన్నారు. జయరామ్ గుంతకల్లులో అడుగుపెట్టిన మొదటిరోజే సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీలో చేరి కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం శోచనీయమన్నారు. ఐదేళ్ల మంత్రిగా కొనసాగిన నీవు వాల్మీకి జాతి కోసం ఏవైనా మంచి పనులు చేశావా అని ప్రశ్నించారు. జయరామ్ లాంటి స్వార్థపరుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు నియోజకవర్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీ, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నామినేటెడ్ పదవులను అత్యధికంగా వాల్మీకి కులస్తులకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించడమే కాకుండా నిరంతరం అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు సుంకప్ప, మోహన్, మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, సర్పంచ్ రమేష్, పార్టీ మండల పోలింగ్ బూత్ కన్వీనర్ పి.రాము పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ వెంకటేశ్వరుడి రథోత్సవం



పూజల్లో పాల్గొన్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



హాజరైన ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు, జిల్లా అధ్యక్షుడు పైలా



రథోత్సవ దృశ్యం

యల్లనూరు: మండల కేంద్రంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు రథాన్ని ప్రారంభించారు. నమో వెంకటేశాయ, గోవింద అని భక్తుల నామస్మరణలతో పురవీధులు మార్మోగాయి. రథాన్ని డిప్యూటీ తహసీల్దారు శ్వేత జెండా ఊపి ప్రారంభించారు. పూజల్లో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పురుషోత్తంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, నాయకులు సుబ్బయ్య, కిరణ్, ఆలయ కమిటీ సభ్యులు తిరుపాల్, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ గిరిబాబులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



తాడిపత్రిలో ఎంపీడీఓకు రాజీనామాపత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

తాడిపత్రిటౌన్/రూరల్: తాడిపత్రి మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మరో 20 మంది వలంటీర్లు ఎంపీడీఓ నరసింహారావుకు రాజీనామా పత్రాలు అందజేసారు. ఇప్పటి వరకు 281 మంది రాజీనామాలు సమర్పించినట్లు ఆయన తెలిపారు. అలాగే పట్టణంలోని నందలపాడు సచివాలయం-1లో పనిచేస్తున్న పలువురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి విజయం కోసం పని చేస్తామని వలంటీర్లు తెలిపారు.


యాడికి: మండల కేంద్రంలో 53 మంది, గుడిపాడు గ్రామంలో 8 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓ సావిత్రికి అందజేశారు. ప్రతిపక్షాలు మాపై చేస్తున్న దుష్ప్రచారాన్ని భరించలేక రాజీనామా సమర్పిస్తున్నట్లుగా వలంటీర్లు తెలిపారు.

పెద్దవడుగూరు: మండలంలోని వలంటీర్లు మధు, రహంతుల్లా, సుధాకర్, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లాల్‌స్వామి, మాధవి, శివాంజినేయులు మంగళవారం రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయడంలోనూ తప్పులు వెతుకుతున్న టీడీపీ నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరారు.

ఎన్నికల నియమావళి అతిక్రమించొద్దు

తాడిపత్రిటౌన్/అర్బన్: ఎన్నికల నియమావళిని అతిక్రమించొద్దని రిటర్నింగ్ అధికారి రాంభూపాల్ రెడ్డి ఆయా పార్టీల నాయకులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలు మరే ఇతర కార్యక్రమాలకు సంబంధించి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా సేవలు మరింత విస్తృతం



రంజాన్ తోఫా కింద నగదును పంపిణీ చేస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: ఫయాజ్ బాషా ట్రస్టు ద్వారా సేవలు మరింత విస్తృతం చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఫయాజ్‌బాషా ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాషా అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణ, రూరల్‌లో ఉన్న మసీదుల్లోని 36 మంది ఇమాం, 36 మంది మౌజన్లకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఒక్కో ఇమాంకు రూ.6,500, ఒక్కో మౌజన్‌కు రూ.3,500తో పాటు స్వీట్ బాక్సులను అందజేశారు. మొత్తం రూ.3,40,000 ఆయన తన కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏటాలాగే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ట్రస్టు ద్వారా ముస్లిం మైనార్టీలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను కూడా పంపిణీ చే చేశామన్నారు. అలాగే ట్రస్టు ద్వారా పేదలకు ఇల్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రియాజ్, ప్రసాద్, బషీర్, వలి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, హాజీవలి దర్గా కమిటీ గౌరవాధ్యక్షులు అస్లాం, అధ్యక్షులు షామీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న శివరామిరెడ్డి, శంకరనారాయణ

గుంతకల్లు: పట్టణంలోని అంకాలమ్మగుడి సమీపంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కురబ మహదేవ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విందులో పాల్గొన్న ముస్లిమ్ సోదరులకు స్వయాన ఇరువురు కలిసి వడ్డించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ఎద్దుల శంకర్, కౌన్సిలర్లు కె.లింగన్న, సమోబాషా, నాయకులు నూర్‌నిజామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాంబ ఆధ్వర్యంలో..



ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: రంజాన్ పవిత్ర మాసంలో శింగవరం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు షెక్షా అధ్యక్షతన ముస్లింలకు మంగళవారం ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముస్లిం సోదరులు పెద్దఎత్తున హాజరయ్యారు. మసీదులో ప్రార్థనలు చేసి, ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ ఉపవాస దీక్షలను విరమించారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పురుషోత్తం నాయుడు, ముస్లింలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి



దైవాలమడుగులో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: సంక్షేమ పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని దైవాలమడుగు గ్రామంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో లక్షుంపల్లె సర్పంచు పద్మనాభరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కొట్టే వెంకటరామిరెడ్డి, నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మోపిరెడ్డి, చంద్రనారాయణరెడ్డి, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



బొందలదిన్నెలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి

పెద్దపప్పూరు: సంక్షేమసారధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం చేసుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి కోరారు. మంగళవారం బొందలదిన్నె గ్రామంలో అయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, సర్పంచు హేమసుందర్ రెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, సింగల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, యూత్ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, వరదాయపల్లి శివారెడ్డి, అశ్వర్థం చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

శింగనమల: మండలంలోని ఆకులేడు సమీపంలో చాకిరేవు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చిన్న పెద్దన్నను మంగళవారం ఉదయం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అతని నుంచి 18 మద్యం బాటిళ్లు, రూ.2700 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

గుత్తి రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని ఊబిచెర్ల, ఊటకల్లు, ధర్మాపురంలో ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నాయకులు సూర్యనారాయణరెడ్డి, మల్లయ్యయాదవ్, విశ్వనాథ్‌రెడ్డి, రామరంగారెడ్డి, లాలునాయక్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గుంతకల్లు: ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తున్న జీఆర్‌పీ సిబ్బందికి మౌలిక వసతులు కల్పించాలని జీఆర్‌పీ ఎస్పీ కే చౌడేశ్వరీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం డీఆర్‌ఎం వినీత్‌సింగ్‌ను కలిసి చర్చించారు.

వైఎస్సార్‌సీపీ 'ఆత్మీయ పలకరింపు'

గుత్తి: పట్టణంలోని 15వ వార్డు (ఎస్సీ కాలనీ)లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు అంజలి, వాల్మీకి శివ, ఫరూక్, వరదరాజులు, కేవీ రమణ, నరేష్, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, సునీల్, ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా వై.వెంకటరామి రెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థిగా శంకర నారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళి ధర్‌రెడ్డి, కౌన్సిలర్ నజీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సీవీ రంగారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి కటిక ఖురేషి అన్వర్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీలో 'ప్రాజెక్ట్ ఎక్స్‌పో'

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు మంగళవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2కే 24 నిర్వహించారు. విద్యార్థుల ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ చైతన్య కిషోర్, ఆర్అండ్‌డీ కన్వీనర్ డాక్టర్ రఘుబాబు, ఈఈఈ హెచ్ఓడీ డాక్టర్ మేరిమాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గుత్తిలోని ఎస్పీవ కాలనీ, జంగాల కాలనీ, చాకలి గేరి, చంద్ర ప్రియనగర్ కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారా లేదా ? అనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, నాగరత్న, ఉమా, నీరజాక్షి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

తాడిపత్రిటౌన్: మండలంలోని చుక్కలూరు గ్రామంలో రైతు మిద్దె గోపాల్‌రెడ్డి (64) మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. పోలీసుల వివరాల మేరకు..అతడు 5 ఎకరాల్లో చీని పంటను సాగు చేస్తున్నాడు. తోటలో బోర్లు ఎండిపోవడంతో పంట సాగు కోసం తన పొలంలో గత మూడు సంవత్సరాల్లో 8బోర్లు వేయడంతో వ్యవసాయం కోసం 15 లక్షల అప్పులు చేశాడు. అప్పు తీర్చే మార్గం కనిపించక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి భార్య పుల్లమ్మ, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.